కరోనా కల్లోలం

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో పడకలు లేకపోవడంతో వేరే ఆసుపత్రికి తరలిస్తుండగా అవస్థలు పడుతున్న కోవిడ్ బాధితురాలు

- రికార్డు స్థాయిలో 2.61 లక్షల కేసులు
- ఒక్కరోజే 1501 మంది మృతి
- మోడీ ప్రభుత్వ అసమర్థ నిర్వాకం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో కరోనా మహమ్మారి పెను కల్లోలం రేపుతోంది. కరోనా మొదటి దశ కొంచెం తగ్గు ముఖం పట్టగానే ఇది తన విజయంగా ఘనంగా ప్రకటించుకున్న మోడీ ప్రభుత్వం ఆ తరువాత దీనిని పట్టించుకోవడం మానేసింది. కేంద్ర ప్రభుత్వ అసమర్థ నిర్వాకం వల్లే నేడు కోవిడ్ రెండో దశ దేశానికి విపత్తుగా దాపురించిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ప్రపంచ కోవిడ్ విలయానికి భారత్ కొత్త ఎపి సెంటర్‌గా మారుతోంది. కోవిడ్ కేసుల పాజిటివిటీ రేటు రెట్టింపు అయ్యింది. గత 12 రోజుల్లో కరోనా పాజిటివిటీ రేటు 8 శాతం నుంచి 16.69 శాతానికి పెరిగింది. 24 గంటలలో దేశంలో కొత్తగా2.61 లక్షల మంది కరోనా బారిన పడ్డారు. దీంతో దేశంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య కోటిన్నరకు చేరుకుంది. కరోనా వల్ల రోజూ వేల సంఖ్యలో చనిపోతున్నారు. దేశంలోకరోనా బారిన పడి ఇంతవరకు మరణించినవారి సంఖ్య లక్షా 77 వేలకు చేరింది. గుజరాత్ వంటి రాష్ట్రాల్లో శవాలను పూడ్చడానికి శ్మశానాలు కూడా ఖాళీ లేని పరిస్థితి. పెరుగుతున్న కోవిడ్ కేసులకు తగినట్లుగా కోవిడ్ కేర్ కేంద్రాలను నెలకొల్పడంలో కేంద్రం అశ్రద్ధ కరోనా రోగుల పాలిట శాపంగా మారింది. అరకొరగా వున్న ఆ ఆసుపత్రుల్లో సైతం తగినన్ని బెడ్లు లేవు. వెంటిలేటర్స్, ఆక్సిజన్ సిలిండర్ల కొరత తీవ్రంగా ఉంది. కోవిడ్ పరీక్షా కేంద్రాలు కూడా తగినన్ని లేక రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అట్టహాసంగా ప్రకటించిన టీకా ఉత్సవ్‌ను వ్యాక్సిన్ కొరత వెక్కిరించింది. కరోనా వ్యాక్సిన్ సంబంధించిన ముడి సామగ్రి ఎగుమతులపై అమెరికా విధించిన ఆంక్షల వల్ల వ్యాక్సిన్ల కొరత మరింత తీవ్ర రూపం దాల్చింది. 136 కోట్ల జనాభాలో ఇంతవరకు 12 కోట్ల డోసుల వ్యాక్సిన్‌ను అందించారు. పెరుగుతున్న కరోనా తీవ్రతను బట్టి చూస్తే ఇది ఏ మూలకూ చాలదని ఆరోగ్య రంగ నిపుణులు పేర్కొన్నారు.

గత ఏడాది కరోనా మహమ్మారి మొదటి సారి విరుచుకుపడినప్పుడు ప్రపంచంలో అత్యధిక కరోనా కేసులు నమోదయిన అమెరికా, బ్రెజిల్ సరసన భారత్ నిలిచింది. సెప్టెంబరులో గరిష్ట స్థాయికి వెళ్లింది. ఆ తరువాత క్రమేమపి తగ్గు ముఖం పట్టడంతో కరోనాపై భారత్ విజయం సాధించిందని ఈ ఏడాది జనవరిలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రకటించారు. ఆ తరువాత దీని గురించి కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం మానేసింది. కోవిడ్‌పై విజయం సాధించామని పదే పదే ప్రభుత్వం ప్రకటించిన తరువాత కొద్ది మాసాలకే అది మళ్లీ విజృంభించనారంభించింది. 2021 మార్చి1న రోజుకు 12,286 కేసులు నమోదవగా, ఏప్రిల్18 నాటికి వచ్చేసరికి ఈ రోజువారీ కేసుల సంఖ్య 2.75 లక్షలకు పెరిగిపోయింది. అంటే ఈ ఆరువారాల్లో దాదాపు 20 రెట్లకు పైగా కేసులు పెరిగాయన్న మాట. గత ఏడాది అత్యధికంగా నమోదైన కేసుల సంఖ్యతో పోల్చితే ఇది రెంట్టింపు. 2020 సెప్టెంబరు 16న అత్యధికంగా 97, 894 కేసులు నమోదయ్యాయి, ఆ ఏడాదికి అదే అతిపెద్ద రికార్డు. ఆ రికార్డును బద్దలు ఏప్రిల్ మొదటి వారంలో బద్దలు కొట్టిన భారత్ గత రెండు వారాలుగో రోజుకో కొత్త రికార్డును సృష్టిస్తోంది. ఈ తీవ్రత ఇప్పట్లో తగ్గేలా లేదు.

ఈ విపత్తును సమర్థంగా ఎదుర్కొనేందుకు మోడీ ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి నిర్దిష్ట ప్రణాళికను ప్రకటించలేదు. ప్రతిదీ అదుపులోనే ఉన్నట్లు మోడీ ప్రభుత్వం మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నప్పటికీ ఆరోగ్య నిపుణులు మాత్రం దీనిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హరిద్వార్‌లో కుంభమేళాను అనుమతించడం, వ్యాక్సిన్ల కొరత, ఆరోగ్య సదుపాయాల మెరుగుదలపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని, కోవిడ్ సంక్షోభంలో చిక్కుకున్న ప్రజలకు నేరుగా నగదు బదిలీ, ఉచిత వైద్యం, ఉచిత రేషన్ ఇవ్వడం ద్వారా ఆదుకోవాలని వామపక్షాలు కోరుతున్నాయి.

ఆదివారం నాటికి..

మొత్తం కేసుల సంఖ్య : 1,77,150
కోలుకున్నవారు : 1,28,09,643
యాక్టివ్ కేసులు : 18,01,316
రికవరీ రేటు 87.23 శాతం
మరణాల రేటు 1.21 శాతం
టీకాలు : 12,26,22,590 డోసులు

ప్రధానిగా కాదు.. బిజెపి ప్రచారకుడిగా మోడీ

- కరోనా విజృంభిస్తుంటే.. భారీయెత్తున ర్యాలీలా?
- సిపిఎం ప్రధాన కార్యదర్శి ఏచూరి విమర్శ

న్యూఢిల్లీ : దేశంలో ఒకవైపు కరోనా తీవ్రస్థాయిలో కోరలు చాస్తున్నప్పటికీ, ప్రధాని నరేంద్ర మోడీ పశ్చిమబెంగాల్ ఎన్నికల ప్రచారంపైనే దృష్టిపెట్టడంపై సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆదివారం ట్విట్టర్ వేదికగా విమర్శలు గుప్పించారు. ప్రస్తుత కరోనా విపత్తు సమయంలో.. మోడీ ఒక దేశానికి ప్రధానిగా కాకుండా, బిజెపి ప్రచారకుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని ఆయన అన్నారు. 'పెరుగుతున్న కరోనా మహమ్మారి వ్యాప్తి కారణంగా మనం ఇబ్బందులు పడుతున్నాం. అయితే ఇటువంటి సమయంలో మనకు అండగా కేంద్ర ప్రభుత్వం లేదు. కేంద్రంలో ఉన్నది ఏంటంటే.. ఎన్నికల ప్రచారకుడితో కూడిన ఒక కంపెనీ. ఈ విధమైన నిర్లక్ష్య వైఖరి వలన ప్రజలు అనేక బాధలు, కష్టాలు పడడంతో పాటు వారి జీవితాలు తీవ్రంగా ప్రభావితమయ్యే ప్రమాదం ఉంది' అని ఏచూరి హెచ్చరించారు. 'భారత ప్రధాని పాత్ర కంటే పార్టీ ప్రచారకుడిగా మోడీ తన పాత్రను ముఖ్యంగా నిర్వహిస్తున్నారు. ఇంకా ఏమైనా సమయం మిగిలివుంటే.. టివిల్లో కనిపించడం కోసమే లేదా హైడ్‌లైన్స్ కోసమే ఏదొకటి చేస్తుంటారు' అని మరో ట్వీట్‌లో అన్నారు.

మన దేశం ప్రస్తుతం గత కొన్ని దశాబ్దాలుగా ఎన్నడూ లేని తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, దీన్ని ఒక యుద్ధంగా ఆర్మీ మాజీ చీఫ్ ఒకరు పోల్చిన విషయాన్ని ఏచూరి ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్రాల ముఖ్యమంత్రులకు అందుబాటులో లేకుండా మోడీ ప్రచారంలో మునిగి తేలుతున్నాడని, కరోనా వ్యాప్తికి అనువుగా సూపర్‌స్పెడర్ ఈవెంట్లలో పాల్గొన్న తర్వాత సమావేశాలు అంటూ మోడీ జిమ్మిక్కులు చేస్తున్నారని దుయ్యబట్టారు. బెంగాల్‌లో పెద్దయెత్తున బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించబోమని తమ పార్టీ ఇంతముందే ప్రకటించిన విషయాన్ని ఏచూరి పునరుద్ఘాటించారు. 'కాంగ్రెస్ కూడా ఇదే ప్రకటన చేసింది. అయితే కేంద్ర హోంమంత్రి(అమిత్‌షా)గా ఒక బిజెపి నేత.. కోవిడ్ గురించి హాస్యాస్పదంగా, అశాస్త్రీయంగా మాట్లాడుతున్నారు. భారతీయుల ప్రాణాల కంటే ఆయనతో పాటు మోడీ నిర్వహిస్తున్న ర్యాలీలు ముఖ్యమా?'అని ఏచూరి మరో ట్వీట్‌లో ప్రశ్నించారు. గత సంవత్సరం భారత్ కరోనాను ఓడించింది అని మోడీ శనివారం చేసిన వ్యాఖ్యలపై ఏచూరి స్పందిస్తూ.. ' నిజమా.. అలా అయితే ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో ఇప్పుడు మనం ఎందుకున్నాం? వైరస్‌తో చనిపోకుండా అడ్డుకునేందుకు ఇప్పటికీ మీ వద్ద ఎటువంటి ప్రణాళిక, వ్యూహం లేదు. భారీ సభలు, ర్యాలీలను వెంటనే ఆపండి. మీ ప్రైవేట్ ట్రస్టు ఫండ్‌ను ప్రజారోగ్యం కోసం విడుదల చేయండి' అని ప్రధాని మోడీకి హితవు పలికారు.

సింఘూ ప్రజానీకానికి రైతన్నల సత్కారం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ సరిహద్దు ప్రాంతంలో రైతులు చేస్తున్న ఆందోళన కొనసాగుతోంది. రైతుల ఉద్యమం 142 రోజుకు చేరుకుంది. ప్రభుత్వం, పోలీసులు వేధింపులకు పాల్పడుతున్నా అన్నదాతలకు అండగా నిలిచి ఉద్యమానికి సహకరించిన సింఘూ ప్రాంత ప్రజానీకానికి సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) కృతజ్ఞతలు తెలియజేసింది. ఆదివారం సింఘూ సరిహద్దు వద్ద వందలాది మంది స్థానిక ప్రజలను వేదికపైకి ఆహ్వానించి రైతులు సత్కారించారు. ఐదు నెలలుగా స్థానిక ప్రజలు నిస్వార్థంతో ఉద్యమానికి మద్దతు ఇచ్చారని అభినందించారు. సింఘూ పరిసర గ్రామాలు, కర్మాగారాలు, కాలనీలు, మార్కెట్ల ప్రజలను ఎస్‌కెఎం ఈ కార్యాక్రమానికి ఆహ్వానించింది కృతజ్ఞతలు తెలిపింది. భవిష్యత్తులోనూ తమ మద్దతు కొనసాగిస్తామని, ఈ సందర్భంగా ప్రజలు ప్రతీనబూనారు. రైతుల డిమాండ్లు నెరవేరినప్పుడే ఢిల్లీ సరిహద్దుల నుండి దేశంలోని ఇతర ప్రాంతాల వరకు రైతుల చేస్తున్న ఆందోళనలు ముగిస్తామని ఎస్‌కెఎం నేతలు తెలిపారు. మానవత్వంతో ప్రభుత్వం రైతుల నిరసన ప్రదేశాలలో టీకా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, వారికి కరోనా నుండి రక్షణ కోసం అవసరమైన పరికరాలు అందించాలని డిమాండ్ చేశారు. కష్టపడి పనిచేసే రైతులు, శ్రామికులతో పోరాడటానికి బదులు ప్రభుత్వం పెరుగుతున్న కరోనా మహమ్మారిపై పోరాడాలని హితవు పలికారు.

వ్యాక్సిన్ పంపిణీలో పారదర్శకత

- కరోనా సంక్షోభ పరిష్కారానికి అయిదు సూచనలు
- మోడీకి మన్మోహన్ లేఖ
- అదే బాటలో కేజ్రీవాల్, మమత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కరోనా మహమ్మారితో దేశం మునుపెన్నడూ లేనంత క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నదని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు , ఈ సంక్షోభ పరిష్కారానికి ఆయన అయిదు చర్యలు సూచిస్తూ ప్రధాని నరేంద్ర మోడీకి ఒక లేఖ రాశారు. అదే బాటలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ కూడా ప్రధానికి లేఖాస్త్రాలు సంధించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆదివారం నాడు ప్రధాన మంత్రికి రాసిన లేఖలో కరోనా మహమ్మారి నుంచి బయటపడ టానికి టీకాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. రాబోయే ఆరు నెలల్లో టీకాలు ఎందరికి ఇవ్వాలో నిర్దేశించుకుని, అందుకు తగినట్లుగా టీకా తయారీ సంస్థలకు ఆర్డర్లు ఇవ్వాలని, వివిధ వ్యాక్సిన్ ఉత్పత్తిదారులకు ఇప్పటి వరకు ఇచ్చిన ఆర్డర్ల వివరాలను ప్రభుత్వం బహిరంగంగా వెల్లడించాలని కోరారు. రాష్ట్రాలకు వ్యాక్సిన్ పంపిణీ పారదర్శకత పాటించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించడం కోసం కేంద్ర ప్రభుత్వం 10 శాతం వ్యాక్సిన్లను ఉంచుకోవచ్చునని, మిగిలిన టీకాలను రాష్ట్రాలు తమకు తగిన ప్రణాళిక ప్రకారం వాడుకోవడానికి అవకాశం కల్పించాలని ఆయన సూచించారు. కరోనాపై ముందు వరుసలో ఉండి పోరాడుతున్నవారిని వర్గీకరించే వెసులుబాటు రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండాలని,45 ఏళ్ళ వయసు లోపువారికి కూడా అవసరమైతే వ్యాక్సిన్ అందించేందుకు రాష్ట్రాలకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు, బస్సులు, త్రిచక్ర వాహనాలు, ట్యాక్సీల డ్రైవర్లు, పంచాయతీ సిబ్బంది, కోర్టులకు వెళ్ళే న్యాయవాదులను ఫ్రంట్‌లైన్ వర్కర్లుగా రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణించాలని, వారి వయసు 45 సంవత్సరాల కన్నా తక్కువగా ఉన్నప్పటికీ, వారికి టీకాలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించవచ్చునని తెలిపారు. టీకా ఉత్పత్తిదారులకు నిధులు, ఇతర రాయితీలు ఇవ్వాలని, తద్వారా మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లను విస్తరించేందుకు సహకరించాలన్నారు. లైసెన్స్ ఉంటే వ్యాక్సిన్లను తయారు చేయగలిగే కంపెనీలు చాలా ఉన్నాయని తెలిపారు. గతంలో ఎయిడ్స్ వ్యాధి విషయంలో ఇదే విధానం పాటించామన్నారు. దేశంలో టీకా సరఫరాకు పరిమితంగా ఉన్నందున యూరోపియన్ మెడికల్ ఏజెన్సీ, యుఎస్ఎఫ్‌డిఎ వంటి విశ్వసనీయ సంస్థల నుంచి అనుమతి పొందిన టీకాలకు మన దేశంలో అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుతం మన దేశ జనాభాలో చాలా తక్కువ భాగానికి మాత్రమే వ్యాక్సినేషన్ జరిగిందన్నారు. సరైన విధానాన్ని రూపొందిస్తే, అత్యంత వేగంగా వ్యాక్సినేషన్ చేయగలమనే నమ్మకం తనకు ఉందన్నారు. తన సలహాలపై తక్షణమే ప్రభుత్వం స్పందించాలని కోరారు.

పరిస్థితి విషమంగా ఉంది ఆదుకోండి : ప్రధానికి కేజ్రీవాల్ లేఖ

ఢిల్లీలో పరిస్థితి విషమంగా ఉందని,ఈ విషయంలో కేంద్రమే ఆదుకోవాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కోరారు. ఈమేరకు ప్రధాని మోడీకి ఆయన ఒక లేఖ రాశారు. ఢిల్లీలో ఆక్సిజన్ కొరత తీవ్రంగా ఉందని, దాదాపు ఐసియు బెడ్స్ అన్నీ నిండిపోయాయని, కేంద్రం ముందుకొచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు. "ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే ఆస్పత్రుల్లో 10,000 పడకలున్నాయి. అయితే 1,800 పడకలను మాత్రమే కోవిడ్ కోసం రిజర్వ్ చేశారని ఆయన వివరించారు.

5.4 కోట్ల వ్యాక్సిన్ డోసులు ఇవ్వాలి : కేంద్రానికి మమత విజ్ఞప్తి

పశ్చిమ బెంగాల్‌కు 5.4 కోట్ల వ్యాక్సిన్ డోసులు ఇవ్వాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమత బెనర్జీ కోరారు. ఈమేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ఆమె ఈమేరకు ఒక లేఖ రాశారు. ఆ లేఖలో 5.4 కోట్ల ఎక్కువ వ్యాక్సిన్ మోతాదులను సరఫరా చేయాలని, రెమ్‌డెసివిర్, టోసిలిజుమాబ్ మెడిసన్ సరఫరా కొనసాగించాలని కోరారు.

యుపిలో తీవ్రస్థాయిలో కరోనా రెండో దశ

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో కరోనా వైరస్ రెండో దశ అత్యంత తీవ్రంగా ఉంది. రాజధాని లక్నోలో మార్చి నెలాఖరుకి 3138 కేసులు ఉండగా, ఈ నెల 16వ తేదీకి ఈ సంఖ్య 40,753 కేసులకు చేరుకుంది. అనేక ఆసుపత్రులను కోవిడ్ ప్రత్యేక ఆసుపత్రులుగా మార్చినట్లు ముఖ్యమంత్రి అదిత్యనాథ్ ప్రకటించినా క్షేత్రస్థాయిలో కోవిడ్ రోగులకు సరైన చికిత్స అందడం లేదు. దేశంలో పాజిటివ్ రేట్‌లో మహారాష్ట్ర తరువాత ఉత్తరప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. అయినా లక్నో, పరిసర ప్రాంతాల్లోని కోవిడ్ ఆసుపత్రుల్లో సరైన వసతులు, వెంటిలేటర్లు లేవు. కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్శిటీ వద్ద 38 ఏళ్ల వికాస్ వర్మ మాట్లాడుతూ 'శ్వాస ఇబ్బందులతో రెండు రోజుల నుంచి బెడ్ కోసం ఎదురుచూస్తున్నాను. బెడ్ ఖాళీ అయితేనే నాకు బెడ్ ఇస్తామని ఆసుపత్రి అధికారులు చెబుతున్నారు' అని తెలిపారు. ఇక్కడ 50 మందికి పైగా రోగులది ఇదే పరిస్థితి.

రేపటి నుంచి తమిళనాడులో నైట్ కర్ఫ్యూ

చెన్నై : కోవిడ్ విజృంభన నేపథ్యంలో ఈ నెల 20 నుంచి తమిళనాడులో నైట్ కర్ఫ్యూ, ఆదివారం లాక్‌డౌన్ అమలు చేయనున్నారు. అలాగే బీచ్‌లు, జూలు, పార్క్‌లు, మ్యూజియంలతో సహా అన్ని పర్యాటక ప్రాంతాలను మూసివేయనున్నారు. వివాహాలను 100 మందినే ముగించుకుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి కె పళనిస్వామి అధ్యక్షతన ఆదివారం జరిగిన సమీక్ష సమావేశం అనంతరం ప్రభుత్వం ఈ నిబంధనలు ప్రకటించింది. ఆదివారాలు పూర్తి లాక్‌డౌన్‌తో పాటు ప్రతీ రోజు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 4 గంటల వరకూ నైట్ కర్ఫ్యూ అమలు చేస్తారు. వీటిపై ఈ నెల 30 మళ్లీ సమీక్ష ఉంటుంది.

మహోద్యమంగా టీకా కార్యక్రమం సాగాలి

ఫోరం ఫర్ ఆసియా

బోయా (హైనన్) : కరోనా మహమ్మారి బారి నుంచి ప్రజలను కాపాడేందుకు టీకా కార్యక్రమాన్ని మహోద్యమంగా సాగించాలని బావో ఫోరం ఫర్ ఆసియా (బిఎఫ్ఎ) సూచించింది. ఈ ఏడాది మార్చి నుంచి అనేక దేశాలు వ్యాక్సినేషన్ ప్రయత్నాలను వేగవంతం చేసినప్పటికీ, టీకా సరఫరాలో అసమానతలు పెరుగుతున్నాయని ఫోరమ్ ఫర్ ఆసియా ఆందోళన వ్యక్తం చేసింది. పేద దేశాలకు వ్యాక్సిన్ల పంపిణీకి గ్లోబల్ అలయన్స్ ఫర్ వ్యాక్సిన్ అండ్ ఇమ్యునైజేషన్ (జిఎవిఐ), కోవిడ్-19 వ్యాక్సిన్స్ గ్లోబల్ యాక్సెస్ (కోవాక్స్) చొరవ చూపాలని అది కోరింది. మహమ్మారి నియంత్రణకు దేశాల మధ్య మరింత సహకారం అవసరమని పేర్కొంది. అలాగే మహమ్మారిపై పోరాటంలో పేద దేశాలకు తక్షణ సహాయాన్ని అందించాలని అది కోరింది.

ఛత్తీస్‌గఢ్ కోవిడ్ ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

రాయ్‌పూర్ : నిర్లక్ష్యం నలుగురు కోవిడ్ బాధితుల ఊపిరి తీసింది. ఛత్తీస్‌గఢ్ జిల్లా రాయ్‌పుర్‌లో కోవిడ్ బాధితులు చికిత్స పొందుతున్న ఓ ప్రయివేటు ఆసుపత్రిలో శనివారం చోటుచేసుకున్న అగ్నిప్రమాద ఘటనలో నలుగురు చనిపోయారు. ఈ విషయాన్ని పోలీసులు ఆదివారం వెల్లడించారు. ఆసుపత్రిలోని అత్యవసర చికిత్స విభాగం (ఐసియు)లో షార్ట్‌సర్క్యూట్‌తో రేగిన మంటలు ఇతర వార్డులకూ వ్యాపించాయని తెలిపారు. కాలిన గాయాలతో ఒకరు చనిపోయారనీ, అగ్నిప్రమాదం కారణంగా రేగిన పొగ వల్ల ఊపిరాడక మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని వివరించారు.

avantel
connect • create • conserve
AVANTEL LIMITED
CIN: L72200AP1990PLC011334
Regd. office: Plot No.47/P, Sy. No.141, APIIC Industrial Park, Anandapuram Mandal, Gambheeram Village, Visakhapatnam - 531 163, Andhra Pradesh.
Web Site:- www.avantel.in; email id :- compliance@avantel.in, cs@avantel.in

నోటీసు

ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా సెబి (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ మరియు డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్ 2015 యొక్క రెగ్యులేషన్ 29తో చదువుతూ రెగ్యులేషన్ 47కు అనుగుణంగా కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరక్టర్ల సమావేశం శనివారం, ఏప్రిల్ 24వ రోజు, 2021న జూబ్లి హైట్స్, ప్లాట్ నం. 68 & 69, సర్వే నం.లు 66 & 67, మాదాపూర్, హైదరాబాద్-500 081, తెలంగాణ ఇండియా వద్ద నిర్వహించబడునని షెడ్యూలు చేయబడింది. మార్చ్ 31, 2021న ముగిసిన నాలుగవ త్రైమాసికం మరియు సంవత్సరం కొరకు ఆడిట్‌చేసిన ఆర్థిక ఫలితాలు, ఇతర విషయాలలో పరిగణిస్తూ, ఆమోదించి మరియు రికార్డ్‌గా తీసుకోవడం జరిగింది.
సమాచారం, కంపెనీ వెబ్‌సైట్ www.avantel.in పై మరియు స్టాక్ ఎక్చేంజ్ వెబ్‌సైట్ కంపెనీ వాటాల జాబితా ఎక్కడో www.bseindia.com పై అందుబాటులో ఉండను.

For Avantel Limited
Sd/-
M. Murali Krishna
Company Secretary
Date : 17-04-2021
Place : Hyderabad

సిపిఎం నేతృత్వంలోని సంయుక్త మోర్చా తరుపున పోటీ చేస్తున్న యువ అభ్యర్థులు మీనాక్షీ, ఐషీ ఘోష్, దీప్సితా ధర్, సృజన్ భట్టాచార్య

భవిష్యత్ పోరాటాలకు యువతే భూమిక

- బెంగాల్ ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పించిన వామపక్షాలు
- యువ అభ్యర్థులకు ప్రజల నుంచి విశేష ఆదరణ

కోల్‌కత్తా : భవిష్యత్‌లో దీర్ఘకాలిక పోరాటాలకు యువతే భూమిక కావాలని వామపక్షాలు కాంక్షిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్ శాసన ఎన్నికల్లో యువతరానికి విశేష ప్రాధాన్యత కల్పించి వామపక్షాలు వారిపై ఎనలేని భరోసా నిలిపాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పోటీ చేస్తున్న స్థానంలోనూ యువ అభ్యర్థిని బరిలో నిలిపాయంటే వామపక్షాలు యువతకు ఎంతటి ప్రాధాన్యత కల్పించాయో అర్థం చేసుకోవచ్చు. ఈ ఎన్నికల్లో సిపిఎం నేతృత్వంలోని సంయుక్త మోర్చా తరపున అనేక మంది యువ అభ్యర్థులు బరిలో నిలిచారు. నందిగ్రామ్‌లో తృణమూల్ నుంచి మమతా బెనర్జీ, బిజెపి నుంచి సువేంద అధికారి వంటి ధన, కండబలమున్నవారు పోటీ చేస్తుండగా వారిని ఎదుర్కొనేందుకు 33 ఏళ్ల మీనాక్షి ముఖర్జీని సంయుక్త మోర్చా తరుపున సిపిఎం అభ్యర్థిగా బరిలో నిలిపారు. మీనాక్షి అర్భాటం లేని, చిత్తశుద్ధితో కూడిన ప్రచారం నందిగ్రామ్ ప్రజానీకాన్ని విశేషంగా ఆకర్షించింది. ఇప్పుడు ఆమె ప్రచార వీడియోలు బెంగాల్‌తో పాటు దేశవ్యాప్తం గానూ వైరల్‌గా మారాయి. 2021 ఎన్నికల్లో ఆమె కొత్త తారగా అవతరించారు.

సంయుక్త మోర్చా తరుపున ఈ ఎన్నికల్లో పోటీలో ఉన్న జెఎన్‌యు విద్యార్థి సంఘం మాజీ నాయకురాలు దీప్సిత ధర్ (బాలీ నియోజకవర్గం), జెఎన్‌యుఎస్‌యు ప్రస్తుత అధ్యక్షురాలు ఆశీ ఘోష్ (జమురియా నియోజవర్గం), ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య (సింగూర్ నియోజకవర్గం), ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రోతికుర్ రహ్మాన్ (డైమండ్ హర్బర్ నియోజకవర్గం) వామపక్షాల యువత అభ్యర్థులకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. దీంతో ఈ ఎన్నికలను మందబలం, ధన బలం దండిగా ఉన్న తృణమూల్, బిజెపి మధ్య జరుగుతున్న రెండు పక్షాల పోటీగా మార్చాలనే ప్రయత్నాలకు గట్టి గండిపడింది. యువ అభ్యర్థులను ఎంపిక చేయడం 'పబ్లిసిటీ స్టంట్'గా బిజెపి-తృణమూల్ వెళ్లగక్కిన అక్కసుకు ప్రజలే గట్టిగా బదులిస్తుండటం విశేషం. యువ కిశోరాల్లాంటి ఈ అభ్యర్థులకు లభిస్తున్న ఆదరణ అక్కడి ప్రజానీకం ప్రస్తుత నిరాశ పరిస్థితుల మధ్య వామపక్షాల పైపు ఆశగా చూస్తున్నారనడానికి ప్రతీకగా నిలుస్తోంది.

ప్రస్తుత ఎన్నికల్లో టిఎంసి, బిజెపిల నుంచి గట్టిపోటీ ఉన్న రాష్ట్రంలో సుదీర్ఘ పోరాటాలకు సన్నద్ధం కావడంలో భాగంగానే యువ అభ్యర్థులకు వామపక్షాలు సీట్లు కేటాయించాయి. బిజెపి, టిఎంసి అమలు చేస్తున్న మత ప్రచారం, రెచ్చగొట్టే భావోద్వేగ ప్రచారాలను సమర్థవంతంగా ఎదుర్కొని.. నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆకలి వంటి జీవనోపాధికి సంబంధించ్ని ఆర్థిక సమస్యలపై దృష్టి పెట్టడానికి యువ అభ్యర్థులకు ప్రాధాన్యతనిచ్చామని వామపక్షాలు పేర్కొంటున్నాయి. భవిష్యత్ పోరాటాలకు యువతే కదా భూమిక.

కెమికల్ ఫ్యాక్టరీలో పేలుడు..ముగ్గురు మృతి

ముంబయి : మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా ఖేడ్‌లో ఒక కెమికల్ ఫ్యాక్టరీలో ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మహారాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఐడిసి)లోని రసాయన క్షేత్రంలో జరిగిన ఈ దుర్ఘటనలో ముగ్గురు మరణించారు. 8 మంది గాయపడ్డారు. యూనిట్‌లో పేలుడు కారణంగానే ప్రమాదం జరిగివుండవచ్చునని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ముగ్గురు ఫ్యాక్టరీలోనే చనిపోగా, క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బందితో పాటు పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

వాతావరణ మార్పులపై ఉమ్మడి పోరు

చైనా, అమెరికా సంయుక్త ప్రకటన



చైనాలోని షాంఘైలో మాట్లాడుతున్న అమెరికా వాతావరణ ప్రతినిధి జాన్‌కెర్రీ

బీజింగ్ : వాతావరణ మార్పుల సమస్యపై కలిసి పనిచేసేందుకు కట్టుబడి ఉన్నామని చైనా, అమెరికాలు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో వెల్లడించాయి. వాతావరణ పరిరక్షణకు సంబంధించి ఉన్న పారిస్ ఒప్పందంతో సహా ఇతర బహుపాక్షిక రంగాల్లో పరస్పరం సహకరించుకుంటామని పేర్కొన్నాయి. అమెరికా వాతావరణ ప్రతినిధి జెన్‌కెర్రీ చైనాలోని షాంఘై పర్యటన తర్వాత ఈ ప్రకటన వెలువడింది. వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఇతర దేశాలతో కలిసి చైనా, అమెరికాలు కలిసి పనిచేస్తాయని తెలిపింది. ఇందుకు సంబంధించి ఇరుదేశాలు తీసుకుంటున్న చర్యలను మరింత బలోపేతం చేస్తామని.. వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్, పారిస్ ఒప్పందం వంటి బహుపాక్షిక రంగాల్లో సహకరించుకుంటామని చైనా పర్యావరణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఈ ఉమ్మడి ప్రకటన పేర్కొంది. పారిస్ ఒప్పందం అమలును ఇరుదేశాలు ఈ సందర్భంగా నొక్కిచ